సురక్షిత తాగునీరు | అందించడమే ధ్యేయం

- అంబర్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌
- రూ. 7.25లక్షల వాటర్‌ పైపులైన్‌ పనులకు శంకుస్థాపన
- నర్సింహబస్తీ పాదయాత్ర చేసి సమస్యలపై ఆరా
- రోడ్ల మరమ్మతుల్లో జాప్యంపై అధికారులపై ఆగ్రహం
- నల్లకుంట డివిజన్‌ సమస్యలను పరిష్కరించాలని ఆదేశం


నల్లకుంట రైల్వే ట్రాక్‌లైన్‌లో స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

నల్లకుంట: నియోజకవర్గం ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకై యుద్ధప్రాతిపదికన డ్రైనేజీ, సీవరేజీ పైపు లైన్‌ పునరుద్ధరణ పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ చెప్పారు. పైపుల్లో లీకేజీ ఏర్పడి ఎక్కడ కూడా తాగు నీరు కలుషితం కాకుండా, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సురక్షిత తాగునీరు అందించాలని జలమండలి అధికారులకు సూచించారు. డ్రైనేజీ పైపుల్లో లీకేజీలు, నీటి సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

❖ బుధవారం నల్లకుంట డివిజన్‌ శంకరమఠం ఎదురు వీధిలో గల శారదా పాన్‌షాప్‌ లేన్‌లో రూ.7.25 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న వాటర్‌ పైపు లైన్‌ పనులకు స్థానిక కార్పొరేటర్‌ అమృతతో కలిసి ఎమ్మెల్యే కాలేరు శంకుస్థాపన చేసి మాట్లాడారు. నియోజక వర్గంలోని చాలా బస్తీలలో దశాబ్దాల క్రితం అప్పటి జనాబా కనుగుణంగా ఏర్పాటు చేసిన డ్రైనేజీ, సీవరేజీ పైపులు శిథిలావస్థకు చేరాయన్నారు.

❖ ఈ కారణంగా పైపుల్లో లీకేజీలు ఏర్పడి తాగు నీరు కలుషితవుతోందన్నారు. ప్రజల విజ్ఞప్తి మేరకు సమస్య శాస్వత పరిష్కార చర్యల్లో భాగంగా దశాబ్దాల క్రితం నిర్మించిన వాటర్‌, డ్రైనేజీ పైపు లైన్‌ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు. డ్రైనేజీ, సీవరేజీ సమస్యలు తలెత్తకుండా జలమండలి అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నర్సింహబస్తీ సమస్యలపై అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం..

నర్సింహబస్తీ, రైల్వే ట్రాక్‌ లేను వాసులు కొన్ని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే జీహెచ్‌ఎంసీ అధికారులు, స్థానికులతో కలిసి నల్లకుంట రైల్వే ట్రాక్‌ లేన్‌ మీదుగా నర్సింహ బస్తీ వరకు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా నర్సింహబస్తీలో డ్రైనేజీ, సీవరేజీ పైపు నిర్మాణ పనులు పూర్తయి నెలలు గడుస్తున్న తవ్విపోసిన రోడ్లకు మరమ్మతులు చేపట్టడంలేదని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. అలాగే రైల్వే ట్రాక్‌ లేన్‌లో రోడ్ల సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు.

❖ దీనిపై స్పందించిన ఎమ్మెల్యే నర్సింహబస్తీలో పైపు లైన్‌ నిర్మాణ పూర్తయి నెలలు గడుస్తున్నా రోడ్ల మరమ్మతుల్లో జరుగుతున్న జాప్యంపై జీహెచ్‌ఎంసీ వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ను నిలదీశారు. నియోజకవర్గంలోని ఏ డివిజన్‌ పరిధిలో కూడా ప్రజల నుంచి ఫిర్యాదులు రావడం లేదని, కేవలం నల్లకుంట డివిజన్‌లోనే సమస్యలు ఎందుకు తలెత్తుతున్నాయని ప్రశ్నించారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.

❖ ఈ కార్యక్రమంలో జలమండలి విజ్ఞానపురి సెక్షన్‌ మేనేజర్‌ జనార్దన్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు మేడి ప్రసాద్‌, భూపతినాథ్‌, రమణానాయుడు, సీహెచ్‌ సాయిమోహన్‌, మాజీ కార్పొరేటర్‌ వనం రమేష్‌, బీజేపీ నేతలు ఎంబీ. కిశోర్‌కుమార్‌, కేజే.బాబు, లక్ష్మణ్‌కుమార్‌, మధుయాదవ్‌, గోపాల్‌, వర్క్‌ సూపర్‌వైజర్‌ నరేందర్‌ తదితరులు పాల్గొన్నారు.


వాటర్‌ పైపులైన్‌ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌, కార్పొరేటర్‌ అమృత

నియోజకవర్గ అభివృద్ధికి చొరవ చూపండి

- ఇంజినీరింగ్‌ పనుల్లో వేగం పెంచండి
- అధికారుల సమావేశంలో ఎమ్మెల్యే

అంబర్‌పేట: నియోజకవర్గ అభివృద్ధిలో జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్‌ విభాగం అధికారులు ప్రత్యేక చొరువ తీసుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ అధికారులకు సూచించారు. బుధవారం ఆయన కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ సర్కిల్‌–16 ఇంజినీరింగ్‌ విభాగం అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనుల పురోగతిపై సమీక్షించారు. పెండింగ్‌ పనుల్లో జాప్యలు నివారించాలని ఆయన సూచించారు. రోడ్లు, నాలాలు, పార్కుల అభివృద్ధి పనుల్లో జరుగుతున్న జాప్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అవసరమైన ప్రాంతాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇతర విభాగం అధికారులతో సమన్వయంగా విధులు నిర్వర్తించి పనులు పూర్తి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈఈ రమేశ్‌, డీఈ ప్రశాంతితో పాటు ఇతర అధికారులు సిబ్బంది ఉన్నారు.



సాఫ్ట్‌వేర్‌ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వ ఆమోదిత నేషనల్‌ స్కిల్‌ అకాడమీ ఆధ్వర్యంలో వివిధ కంప్యూటర్‌ సాఫ్ట్‌వేర్‌ కోర్సుల్లో ఆన్‌లైన్‌ శిక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రోగ్రాం కో–ఆర్డినేటర్‌ సాయి శ్రీమాన్‌ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌, డిగ్రీ పీజీ, పాలిటెక్నిక్‌, ఇంజనీరింగ్‌ విద్యార్హత గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో డిసెంబర్‌ 10వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. కంప్యూటర్‌ సాఫ్ట్‌వేర్‌ రంగంలో రాణించేందుకు అవసరమైన ఆర్టిఫిషియల్‌ ఇంటలిజెన్స్‌, మెషిన్‌ లర్నింగ్‌, బిజినెస్‌ అనలిటిక్స్‌, దేవోప్స్‌, ఫుల్‌స్టాక్‌ డెవలపర్‌, పైథాన్‌, డేటా సైన్స్‌, బిగ్‌ డేటా, క్లౌడ్‌ కంప్యూటింగ్‌, సైబర్‌ సెక్యూరిటీ, ఎథికల్‌ హ్యాకింగ్‌, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్‌, బ్లాక్‌చైన్‌ వంటి 100కి పైగా కంప్యూటర్‌ సర్టిఫికేషన్‌ కోర్సుల్లో ఆన్‌లైన్‌ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు. కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు దేశ విదేశాలలో ఉత్తమ ఉపాధి అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. వివరాలకు ఆన్‌లైన్‌లో లేదా ఫోన్‌ నం.95058 00050లో సంప్రదించాలని సూచించారు.

రాజ్యాధికారంలోకి ఉత్పత్తి శక్తులు రావాలి


గాదగోని రవి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాజ్యాధికారంలోకి ఉత్పత్తి శక్తులైన కష్టజీవులు వచ్చినప్పుడు మాత్రమే సంపద సమాన పంపిణీ జరుగుతుందని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్‌ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 29, 30 తేదీలలో జనగామ జిల్లా పాలకుర్తిలో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో సమానతలు రూపుమాపడానికి తమ పార్టీ కృషి చేస్తుందన్నారు. తెలంగాణలో రాజకీయ ప్రత్యామ్నాయంగా బహుజన లెఫ్ట్‌ ఫ్రంట్‌ ఏర్పడిందన్నారు. కమ్యూనిస్టులంతా ఐక్యమత్యమై రాజ్యాధికారం కోసం కృషి చేయాలని అందుకోసం ప్రజా పోరాటాలు నిర్మించాలన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

రిటైర్డ్‌ ఐఏఎస్‌ అధికారి చొల్లేటి ప్రభాకర్‌



కవాడిగూడ: రాజ్యాంగ పరిరక్షణ ప్రతి పౌరిడి బాధ్యతని రిటైర్డ్‌ ఐఏఎస్‌ అధికారి చొల్లేటి ప్రభాకర్‌ అన్నారు. బుధవారం లోయర్‌ ట్యాంక్‌బండ్‌లోని డా.బీఆర్‌.అంబేడ్కర్‌ భవన్‌లో ఎస్సీ హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో 75వ రాజ్యాంగ ఆమోదిత దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చొల్లేటి ప్రభాకర్‌ మాట్లాడుతూ... ప్రస్తుత సమాజంలో బహుజన సంఘాల పాత్ర, పౌరులు బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన భారత రాజ్యాంగం పట్ల సమాజంలో సగం మందికి అవగాహన లేకపోవడం విచారకరమని అన్నారు. డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ రాజ్యాంగంలో అనగారిన వర్గాల ఆకాంక్షలు నెరవేరే విధంగా అనేక సెక్షన్లు పొందుపరిచారని తెలిపారు. అనంతరం 'దళితులకు రాజ్యాధికారం ఎండమావేనా.?'అనే కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఎస్సీ హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షులు సుదర్శన్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు రాగాల నాగేశ్వర్‌రావు, ఎస్‌ నర్సింహరావు, ప్రొ. ఏకు తిరుపతి, కృష్ణవేణి, గుంటి విజయ్‌బాబు, రాడపాక పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ పోస్టర్‌ ఆవిష్కరణ

ముషీరాబాద్‌: బహుజన ఆశయ సాధన సమితి చలో ఢిల్లీ పోస్టర్‌ను ముషీరాబాద్‌ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహుజన ఆశయ సాధన సమితికి తన పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు గొల్లమందల గోపాల్‌, ఎంపీ కంటెస్టెడ్‌ కృప, నాయకులు శాంతికుమార్‌, వై.శ్రీను, శంకర్‌, ముచ్చింతాల వంశీ, నరేష్‌ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే తెలంగాణ ఆవిర్భవించింది

ఎమ్మెల్యే ముఠా గోపాల్‌

ముషీరాబాద్‌: కేసీఆర్‌ ఆమరణ నిరాహార దీక్షతోనే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని ముషీరాబాద్‌ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ అన్నారు. కేసీఆర్‌ దీక్ష చేపట్టి రోజును వేడుకలా నిర్వహించడానికి బీఆర్‌ఎస్‌ శ్రేణులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. బుధవారం అడిక్‌మెట్‌ డివిజన్‌ లలితానగర్‌ కమ్యూనిటీహాల్‌లో దీక్ష దివాస్‌ సన్నాహక సమావేశం జరిగింది. 29వ తేదీన రాంనగర్‌ చౌరస్తాలోని అమరవీరుల స్థూపం వద్దకు బీఆర్‌ఎస్‌ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఫుట్‌పాత్‌ ఆక్రమణల తొలగింపు

ముషీరాబాద్‌: ముషీరాబాద్‌ చౌరస్తా నుంచి ప్రాగా టూల్స్‌ చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌ ఆక్రమణలను బుధవారం జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్‌ పోలీసు ఉన్నతాధికారులు తొలగించారు. ఈ సందర్భంగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారం చేసే వారిని పోలీసులు హెచ్చరించారు. ఈ సందర్భంగా సెంట్రల్‌ జోనల్‌ ట్రాఫిక్‌ డీసీపీ అశోక్‌కుమార్‌ మాట్లాడుతూ... రద్దీ ప్రాంతాలలో ట్రాఫిక్‌ సమస్యలను తొలగించేందుకు ఆపరేషన్‌ రోప్‌ కార్యక్రమంలో భాగంగా యుద్ధ ప్రాతిపాదికన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రోడ్లను ఆక్రమించి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్‌ జోనల్‌ అడిషనల్‌ ట్రాఫిక్‌ డీసీపీ మాజీద్‌, ఏసీపీ ఎర్నా, చిక్కడపల్లి ట్రాఫిక్‌ సీఐ వీరేశం, జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్‌ ఏసీపీ దేవేందర్‌, ట్రాఫిక్‌ ఎస్సైలు కార్తీక్‌, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు


ఆలీకేఫ్‌, జిందాతిలస్మాత్‌ రోడ్‌లో ఫుట్‌పాత్‌ ఆక్రమణలను తొలగిస్తున్న ట్రాఫిక్‌ అధికారులు


అంబర్‌పేటలో తొలగింపు చర్యలను పర్యవేక్షిస్తున్న ట్రాఫిక్‌ డీసీపీ అశోక్‌కుమార్‌

అంబర్‌పేట: ఫుట్‌పాత్‌ ఆక్రమణలు, ట్రాఫిక్‌ ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై ట్రాఫిక్‌ అధికారులు కొరడా ఝులిపించారు. అంబర్‌పేట ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో బుధవారం ఆలీకేఫ్‌ చౌరస్తా నుంచి జిందా తిలస్మాత్‌ చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న ట్రాఫిక్‌ ఇబ్బందులను తొలగించారు. ప్రత్యేక డ్రైవ్‌ నిర్వహించి ఫుట్‌పాత్‌, రోడ్డును ఆక్రమించి నిర్వహిస్తున్న దుకాణాదారులపై కేసులు నమోదు చేసి అడ్డుగా ఉన్నవాటిని తొలగించారు. ట్రాఫిక్‌ డీసీపీ ఎన్‌. అశోక్‌కుమార్‌, ఏసీపీ సంపత్‌కుమార్‌ పర్యవేక్షణలో పెద్ద ఎత్తున ట్రాఫిక్‌ అధికారులు, సిబ్బంది రోడ్డుపై ఉన్న అడ్డంకులను తొలగించారు. అంబర్‌పేటలో ప్రధాన రోడ్డులలో ట్రాఫిక్‌ మళ్లింపు చర్యలు ఉండటంతో ప్రత్యామ్నాయ రోడ్డుగా ఆలీకేఫ్‌ చౌరస్తా, జిందా తిలస్మాత్‌ రోడ్డు మీదుగా గోల్నాక కొత్త బ్రిడ్జిపైకి నిత్యం వేలాదిగా వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఈ రోడ్డుకు ఇరువైపుల ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలతో పాటు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్వహిస్తున్న డబ్బాలను నిర్దాక్షిణ్యంగా తొలగించారు. మధ్యహ్నం 12గంటల నుంచి 3గంటల వరకు ఫుట్‌ ఆక్రమణల తొలగింపు చర్యలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ లెనిన్‌బాబు, నల్లకుంట, కాచిగూడ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్‌, రాంబాబు, ఎస్సై వీరమల్లు, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

హైదరాబాద్‌-2 డిప్యూటీ లేబర్‌ కమిషనర్‌గా జాసన్‌



చిక్కడపల్లి: డిప్యూటీ లేబర్‌ కమిషనర్‌ హైదరాబాద్‌–2గా బి.జాసన్‌ బుధవారం సాయంత్రం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని కార్మికశాఖ కమిషనర్‌ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు త్వరతగతిన అందేలా చూస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అన్ని విభాగాలలో పదోన్నతిలు వేగవంతం చేశారని ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్మికశాఖ ముఖ్యకార్యదర్శి సంజయ్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్మిక శాఖ అధికారులు బి.జాసన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

చిక్కడపల్లి: జవహర్‌నగర్‌లోని టీఆర్టీలోని బస్తీదవాఖానను బుధవారం కార్పొరేటర్‌ పావని పర్యవేక్షించి డాక్టర్‌ ప్రవణికతో కార్పొరేటర్‌ సమీక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ... దవాఖానాకు వచ్చే వారికి నాణ్యమైన వైద్య సేవలతో పాటు మందులు అందించాలని సూచించారు. రోగులకు అవసరమయ్యే రక్త, బీపీ, షుగర్‌ లాంటి పరీక్షలను నిర్వహించి వాటి రిపోర్టులను అందజేయాలన్నారు. బస్తీ దవాఖానలో ఏలాంటి సౌకర్యాలు కావాలన్న తమ వంతు సహకారం అందిస్తామన్నారు.

గోపాల్‌రావు మరణం కార్మిక లోకానికి తీరనిలోటు


గోపాల్‌రావు పార్థివదేహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే జి.వివేక్‌ వెంకటస్వామి

కాచిగూడ: తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమ నేత, కార్మికనాయకుడు, మాజీ కార్పొరేటర్‌ ఎస్‌.గోపాల్‌రావు మరణం కార్మిక లోకానికి తీరని లోటు అని చెన్నూరు ఎమ్మెల్యే జి.వివేక్‌ వెంకటస్వామి అన్నారు. బుధవారం కాచిగూడ, నింబోలిఅడ్డలో గోపాల్‌రావు పార్థివదేహానికి ఆయన పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బుధవారం జరిగిన ఆయన అంత్యక్రియల్లో వివేక్‌ పాల్గొని సంతాపం ప్రకటించారు. గోపాల్‌రావు తన తండ్రి వెంకటస్వామితో కలిసి కార్మిక ఉద్యమాల్లో పాల్గొన్నారని ఆయన గుర్తు చేశారు. అణగారిన ప్రజల అభ్యున్నతి కోసం గోపాల్‌రావు చేసిన కృషి ఎనలేనిదని అన్నారు. ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అంత్యక్రియలు హరాస్‌పెంటలోని హిందూ శ్మశానవాటికలో నిర్వహించారు. ఆయన అంత్యక్రియల్లో సీనియర్‌ కాంగ్రెస్‌ నేత వి.హనుమంతరావు, కార్పొరేటర్‌ కన్నె ఉమా రమేష్‌ యాదవ్‌, సి.నందకిషోర్‌ యాదవ్‌, లక్ష్మణ్‌రావు, కృష్ణాగౌడ్‌, విజయ్‌కుమార్‌, డాక్టర్‌ కొండా శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌రావు మరణం పట్ల గవర్నర్‌ సంతాపం

కాచిగూడ: మాజీ కార్పొరేటర్‌ ఎస్‌.గోపాల్‌రావు మరణం పట్ల హర్యాణ గవర్నర్‌ బండారు దత్తాత్రేయ బుధవారం ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఈ కష్టకాలంలో బాధను తట్టుకోవడానికి వారి కటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు బండారు దత్తాత్రేయ తెలియజేశారు.

మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలి


అంబేడ్కర్‌ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాస్టర్‌ దయానంద్‌, మల్ల కాశీనాథ్‌

చిక్కడపల్లి: బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఉన్నటువంటి ఆర్టికల్స్‌ గురించి తెలుసుకోవాలని యునైటెడ్‌ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మాస్టర్‌ దయానంద్‌ అన్నారు. మాలమహానాడు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు మాస్టర్‌ నర్మెట దయానంద్‌ అన్నారు. బుధవారం సాయంత్రం జవహర్‌నగర్‌లో రాజ్యాంగ దినోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన అంబేడ్కర్‌ చిత్రపటానికి పూలమాలవేసి నివాళుర్పించారు. బడుగు బలహీన వర్గాలు రాజ్యాంగం అందించిన హక్కులు సాధించుకోవడానికి ఉద్యమాలు చేయాలని కోరారు. నర్మెట్ట మల్లేష్‌ మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబర్‌ 1న పరేడ్‌గ్రాండ్స్‌లో నిర్వహించే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యునైటెడ్‌ ఫోరం ఉపాధ్యక్షుడు మల్ల కాశీనాథ్‌, నాయకులు మన్నె శ్రీధర్‌, దళిత హక్కుల రక్షణ సంఘం అధ్యక్షురాలు బొనగిరి మంగ, రమేశ్‌, నాగెల్లి కృష్ణ, ఎస్‌.వెంకటేష్‌, యాజగిరిరావు, నర్సింగరావు, లక్ష్మణ్‌ రావు, రవీందర్‌, లోకేశ్‌, సదానంద్‌, శ్రీనివాస్‌, బల్వంత్‌, లక్ష్మణ్‌రావు, రవీందర్‌ తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు ప్రజలు సహకరించండి


సర్వే సిబ్బందికి వివరాలు తెలుపుతున్న కార్పొరేటర్‌ పద్మ

అంబర్‌పేట: ప్రభుత్వం చేపట్టిన సర్వేకు ప్రజలు సహకరించాలని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్‌ బి.పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం డీడీకాలనీలోని కార్పొరేటర్‌ నివాసానికి వచ్చిన సర్వే అధికారులకు ఆమె వివరాలను అందించారు. సర్వే అధికారులు అడిగిన వివరాలను అందించినట్లు కార్పొరేటర్‌ తెలిపారు. ఆమె బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నేత బి.వెంకట్‌రెడ్డి ఉన్నారు.

న్యూరామాలయంలో కార్తీక దీపోత్సవం



నల్లకుంట: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని న్యూ నల్లకుంటలోని శ్రీసీతారామాంజనేయ సరస్వతి ఆలయ ప్రాంగణంలో బుధవారం సాయంత్రం కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు లింగాకారంలో సహస్ర దీపాలు వెలిగించారు. అంతకు ముందు అక్కడి పర్వత వర్ధిని రామ లింగేశ్వర ఆలయంలో శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది. ఈ వేడుకల్లో నల్లకుంట కార్పొరేటర్‌ అమృత, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌ జమలాపురం గోపాల్‌ రావు, సభ్యులు ఎస్‌. వెంకటేశ్వరరావు, మధుకుమార్‌, వై. మురళి మధుసూదన్‌, మురళీకృష్ణ, మంజులతో పాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

రేపు శివపార్వతుల కల్యాణం..

కార్తీక మాసం ముగింపుని పురస్కరించుకొని శుక్రవారం (రేపు) సాయంత్రం 6.30 గంటలకు న్యూరామాలయం ప్రాంగణంలో శివపార్వతుల కల్యాణం ఉంటుందని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌ జమలాపురం గోపాల్‌రావు చెప్పారు. అనంతరం తీర్థప్రసాద వితరణ ఉంటుందన్నారు. కల్యాణంలో పాల్గొనాలనుకునే భక్తులు వివరాలకు ఆలయ గుమస్తా, అర్చక స్వామిని సంప్రదించాలని కోరారు.

వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా పనులు

ముషీరాబాద్‌: ముషీరాబాద్‌లో వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తే ప్రాంతాలలో శాశ్వత పరిష్కారానికి నిర్మాణ పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ అన్నారు. బుధవారం వినోభానగర్‌ ప్రేయర్‌పవర్‌ చర్చి వీధిలో రూ.30 లక్షలతో వరద నీరు సాఫీగా వెళ్లేందుకు, సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ముఠా గోపాల్‌, డివిజన్‌ కార్పొరేటర్‌ సుప్రియానవీన్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. కార్పొరేటర్‌ సుప్రియానవీన్‌గౌడ్‌ మాట్లాడుతూ.. ముషీరాబాద్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు విడుదల చేయిస్తున్నామని అన్నారు. వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పార్శిగుట్టలో పనులు చేపడుతున్నామన్నారు. ప్రజలు అభివృద్ధి పనుల నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. ముషీరాబాద్‌ డివిజన్‌ వైఎస్‌ఆర్‌ పార్కు సమీపంలోని ఇండోర్‌ స్పోర్ట్స్‌ కంప్లెక్స్‌లో రూ.3.86 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధునిక లైటింగ్‌ సిస్టమ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. స్టేడియం చుట్టూ వాకింగ్‌ ట్రాక్‌ ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

ఒత్తిడిని దూరం చేసే ఔషధం సినీ, భక్తిగీతాలు


గాయనీ గాయకులతో చింతలపూడి త్రినాథరావు, రమణకుమారి

చిక్కడపల్లి: మానసిక ఒత్తిడిని దూరం చేసే ఔషధం సినీ, భక్తి గీతాలని అంతర్జాతీయ గాన కళారత్న, ప్రముఖ గాయకుడు చింతలపూడి త్రినాథరావు అన్నారు. బుధవారం రాత్రి త్యాగరాయ గానసభలో సినీ, భక్తిగీతాల విభావరి జరిగింది. ప్రముఖ గాయని రమణకుమారి, సహగాయకులు విజయకుమార్‌, ఖాసీం, ప్రభాకర్‌, వేణుగోపాల్‌, కమలాకర్‌ పాటలు పాడారు. శాస్త్రీయ సంగీత గాయని స్వర్ణ మంగళంపల్లి కర్ణాటక సంగీత భక్తి పాటలను ఆలపించారు. త్రినాథరావు మాట్లాడుతూ.. సహ గాయకులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో రాగరాగిణి సంస్థను రమణకుమారి ఆరంభించారని ప్రశంసించారు.

వీహెచ్‌ వాహనాన్ని ఢీకొట్టిన మరో వాహనం



అంబర్‌పేట: మాజీ ఎంపీ, కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు వి.హనుమంతరావు ఇంటి ముందు పార్క్‌ చేసిన అతని వాహనాన్ని గుర్తు తెలియన వాహనం ఢీకొట్టింది. బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో వాహనం ధ్వంసం అయ్యింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. వీహెచ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్‌ అశోక్‌ తెలిపారు.

'విద్యార్థుల చావులకు ప్రభుత్వానిదే బాధ్యత'

కాచిగూడ: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు సరైన భోజనం లేక ఆకలి చావులు పెరుగుతున్నాయని వారి చావులకు రేవంత్‌ రెడ్డి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని తెలంగాణ సోషలిస్ట్‌ స్టూడెంట్‌ అసోసియేషన్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరేళ్ల మహేష్‌కుమార్‌ డిమాండ్‌ చేశారు. బుధవారం బషీర్‌బాగ్‌ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హాస్టళ్ల నిర్వహణకు, విద్యార్థుల భోజనాలకు అవసరమైన నిధులను ప్రభుత్వం అందించడంలో పూర్తి విఫలం చెందడం వల్లే విద్యార్థులు చావులు పెరిగాయన్నారు. ఎక్కడ చూసిన ఫుడ్‌పాయిజన్లతో విద్యార్థులు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల హాస్టల్‌ ఫీజులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు. లేని పక్షంలో వచ్చే శాసన సభ సమావేశాలను వేలాది మంది విద్యార్థులతో అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఉదయ్‌కుమార్‌, ఈర్ల ప్రసాద్‌, మేడి నాగరాజు, సతీష్‌ కుమార్‌, అనిత, మేఘన, అక్షయ, రజిత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యార్థుల మరణాలపై ప్రభుత్వం వెంటనే స్పందించి మృతుల కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం,

రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని ధర్మ స్టూడెంట్‌ యూనియన్‌ (డీఎస్‌యూ) నాయకులు డిమాండ్‌ చేశారు. గురువారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కోకన్వీనర్‌ సైదాబాబు మాట్లాడుతూ.. స్కూళ్లు, కాలేజీలు, హాస్టళ్లలో ఇప్పటి వరకు 50 మంది విద్యార్థులు మరణించినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మరణాలపై విచారణ జరిపించి కారకులను చట్టపరంగా శిక్షించాలని డిమాండ్‌ చేవారు. కార్యక్రమంలో లింగయ్య, శివ, నిఖిల్‌, మల్లేష్‌, అశోక్‌, దుర్గారావు, ప్రఫుల్‌, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ జాతీయ కార్యవర్గంలో రాష్ట్ర నేతలకు చోటు


జీవన్‌

ఉస్మానియా యూనివర్సిటీ: ఏబీవీపీ జాతీయ కార్యవర్గంలో తెలంగాణ ఆల్‌ యూనివర్సిటీల కన్వీనర్‌ జీవన్‌కు చోటు దక్కింది. యూపీలోని గోరఖ్‌పూర్‌లో జరుగుతున్న ఏబీవీపీ 70 జాతీయ మహాసభల్లో జీవన్‌ జాతీయ కార్యవర్గ సభ్యునిగా ఎన్నికైనట్లు తెలిపారు. ఓయూలో పీహెచ్‌డీ చేస్తున్న జీవన్‌ డిగ్రీ నుంచి ఏబీవీపీలో పని చేస్తూ విద్యార్థి సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. రాష్ట్ర స్థాయిలో వివిధ పదవులను చేపట్టిన జీవన్‌ జాతీయ కార్యవర్గంలో చోటు లభించడం పట్ల ఆనందం వ్యక్తం చేశాడు.

బీఆర్‌ఎస్వీ నాయకులను విడుదల చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: గురుకుల విద్యార్థుల మరణాలను నిరసిస్తూ ఆందోళన చేపట్టిన విద్యార్థి నాయకులను వెంటనే విడుదల చేయాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.వేల్పుకొండ వెంకటేష్‌ గురువారం డిమాండ్‌ చేశారు. కలుషిత ఆహారంతో 50 మంది విద్యార్థులు మరణించినా కాంగ్రెస్‌ ప్రభుత్వం పట్టించుకోనందుకు నిరసనగా బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్‌ యాదవ్‌ ఆధ్వర్యంలో మాసబ్‌ట్యాంక్‌లోని సంక్షేమ భవన్‌ ముట్టడి, ధర్నా సందర్భంగా అక్రమంగా అరెస్ట్‌ చేశారని పేర్కొన్నారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థి నాయకులను అరెస్ట్‌ చేయడం దుర్మార్గమని గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌తో పాటు ఇతర బీఆర్‌ఎస్వీ నాయకులను వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.